# కవితా కౌముది

## నాలుగో పాదం

దాట్ల దేవదానం రాజు

రెప్పలు మూయని ఎదురుచూపులు
ఆప్యాయతల పలకరింపుల కోసం
ఒక ఆత్మీయ కరచాలనం కోసం
విమోచనానంతర జీవన శకలం
మూలగది మాధ్యమంగా
చిన్ని ప్రపంచంలో కూరుకుపోతూ.
తడిలేని కళతప్పిన
ముడతల కడాఖరు మజిలీ.
ప్రవాసాలు, వాటాల మధ్య అస్తిత్వ నిరాకరణ
ఆఖరిపాదంలో చీదరింపుల పర్వం.
కాలప్రవాహపు ఎదురీత
పరాయితనాన్ని మోస్తున్న ఘడియలు.
అరిగిపోయిన చందనపు కొయ్య
ముసలి కంపుల దైన్యం.
రాటుదేరిన కొరడా దెబ్బలు
భుజం నలిగిన బతుకులు
తలమీద దుఃఖభారాలు
అనంతానంతమైన అనుభవాలు..!

మందులు మాకులు వద్దు

రోజూ వచ్చి కాసేపు మాట్లాడరా, అబ్బాయ్..!!



యానాం దగ్గర పిల్లంకలో హైస్కూలు టీచర్‌గా పనిచేస్తున్న శ్రీ దేవదానం రాజుగారు ఎం.ఎ(ఎకనామిక్స్ ) , ఎం.ఎ(తెలుగు ) , ఎం.ఇ.డి డిగ్రీలు చేశారు. ఇంతవరకూ నాలుగు కవితా సంకలనాల్ని, ఒక కథా సంపుటాన్ని ప్రచురించారు. యానాం చరిత్ర గురించి ఒక పుస్తకం రాస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లోని అనేక కవిసమ్మేళనాల్లో పాల్గొనడంతో బాటు, వీరి 'వానరాని కాలం' అనే కవితా సంపుటికి సరసం అవార్డు, 'మట్టికలలు' సంకలనానికి ఆంధ్ర సారస్వత సమితి అవార్డు లభించాయి. 'సుజనరంజని' కోసం అడిగిన వెంటనే కవిత పంపించినందుకు వారికి సిలికానాంధ్ర కృతజ్ఞతలు తెలియ చేస్తోంది.

ఏప్రిల్ ౨ న, కాలిఫోర్నియా, లివర్ మోర్ దేవాలయంలో సిలికానాంధ్ర నిర్వహించిన శ్రీపార్థివ ఉగాది ఉత్సవం - స్వర సాహితీ సమ్మేళనం లో పాల్గొన్న కవులు చదివిన, చివరి విడత, స్వీయ కవితలు -

## ఆంధ్రుల ప్రతిజ్ఞ

-మృత్యుంజయుడు తాటిపాముల

వసంత హేల ప్రతిచోట పూలు విరియ
చెట్లు చిగుర్చే ప్రకృతి కాంత మెరియ
పార్థివ ఏతెంచెగ పండగ జరుపుకుందాం!
ఉగాది పచ్చడి తింటూ ఒక ప్రతిన చేద్దాం!
రండి! పంచాగ్రశవణంతో జతగా ఐక్యత ప్రకటిద్దాం!
కన్నబిడ్డలే ఇంటిలోన అడ్డుగోడ కట్టగ
వేరు కుంపటికై పోరు పడగ చూసి

తెలుగుతల్లి మనసు తల్లడిల్లింది
మన మాతృమూర్తి గొంతు మూగబోయింది!
కోర్కెలీడేర్చ కోనేటిరాయుడు - హరి మీవాడు
జ్యోతిర్లింగ శ్రీశైలం మల్లడు - హరుడు మావాడు
దేవుళ్ళను విడదీద్దామా? వర్గాలు కడదామా?
రాజమహేంద్ర జనిత కవిత్రయ భారతం మీకు
ఏకశిలలో విరచించిన పోతన భాగవతం మాకు
కావ్యాలు పంచుకుందామా? చరిత్ర రెండుగ చీలుద్దామా?
చెళుకులు విసిరే సినారె గజళ్ళు మావి
అమృతం కురిసిన బాలగంగాధర రాత్రుళ్ళు మీవి
పంపకాలకు కూర్చుందామా? పాళ్ళు పంచుకుందామా?
తేనెలూరగ తేట తెలుగైననేమి
యాస ప్రాసతో సాగే తెలంగాణ భాషైన ఏమి
రెండు కన్నులలోన ఏ కన్ను మిన్న? చెప్పరా ఓ అన్న?
కూచిపూడి మనది, కృష్ణశాస్త్రి కోయిల గీతాలు మనవి
కదనాలు తొక్కిన శ్రీరంగం కవనాలు మనవే మరి
గద్దర్ పాటలలోని  ఆకలి అరుపులు
మన సోదరులందరివే
ప్రపంచంలో సాటిలేని పంచెకట్టురా మనది
గట్టు పెట్టే మట్టి గడ్డ కాదురా ఇది
చిత్తశుద్ధిగ పనిచేయ ఏకంగ మనలేమా?
ఉగాది పచ్చడి తింటూ మనం ప్రతిన చేద్దాం!
రండి! పంచాగ్రశవణంతో జతగా ఐక్యత ప్రకటిద్దాం!




**Click here to watch Video**

## పంచె

-'సన్యాసి'

పంచె కట్టి పరుగు తీయలే మటంచు,
పేంటు కట్టిన జనులు గోతిలో పడరె?

పరుగులెట్టి పాలు త్రాగే కన్న
నిలిచి సుఖముగా నీళ్ళు త్రాగ వలదె?
పంచె జారిన మాన భంగమను భీతితో
పంచె కట్టమనుచు జనులు పలుక,
"పంచె కట్టు తీరు తెలియదు మీ" కనుచు
పంచె కట్టించిరి సిలికానాంధ్ర జనులు.
పంచె కట్టు మా హక్కనుచు ఉత్తరాది
"పొండు మీకేమీ తెలుస"నుచు దక్షిణాది
పంచె కట్టే మనజాతికి కట్టను
మాట విలువ గనరు మూఢ జనులు.
తొడుగు కున్న పంచెలు వచ్చెనిపుడు,
సులభమాయె బతుకు పురుషులకును ,
తొడుగుకున్నదే యని తెలియనే రాదురా ,
తిలకించిన మానవాళి కిపుడు.
పంచపాత్రలోని పంచామృతములను
పంచె ధరియించకనే గ్రోల వచ్చు,
కాని, సిలికానాంధ్ర సభలలోన
పంచె కట్టనివాడు పాలుగొనడు.
పంచెకున్న విలువ బహు విధములన్న ..
పలురీతి తలపాగ చుట్టవచ్చు
లేకనంగ వస్త్రముగ దాని మలచవచ్చు
జోడించి కప్పుగొనగ, చలి పారిపోవు. !
మనము యారాధించు పురుష దైవములు
సకల మతముల దేవతా మూర్తులంత
కట్టినది అనాదిలో పంచె కాదె?
నాటి దేవతా మాన రక్ష మన పంచె మూల రక్ష.
పంచె కట్టే కద శ్రీకారముంజుట్టె
పంచమవేదమునకు, నన్నయ్యభట్టు,
ఠీవిగా పంచె కట్టి కిరీటమ్ము పెట్టి,
భువన విజయమ్మున నలరె కృష్ణ రాయుండు,



**Click here to watch Video**

పంచె కట్టుతోనె ప్రాణాలు బాసి,
పొట్టి శ్రీరాముండు తెలుగు జాతి నిలిపె,
గుర్రమ్ము జాషువా కాక దేవులపల్లి,
విశ్వనాధ, జంధ్యాల పాపయ్య శాస్త్రి.
పంచె కట్టి మనకందించినారు
తెలుగు కవితా సుధామృతమ్ము !
దాని గ్రోల నీకింత వెగటదేల పంచె కట్టలేదన్న కించగాక?
పంచె కట్టులోన ఎన్ని బాధలున్న
కట్టితీరవలయునన్న ధీరుడొకడు
పంచె కట్టక ఉన్న మనుజుడెట్లగు
నన్నమాట వినుడు జనులు నిజము.
అలనాటి పలనాటి వీరులందరు కలసి
పంచె తలపాగ చుట్టలేద?
కృష్ణదేవరాయ భువనవిజయమ్మున
కవుల తలపాగాలు చూడలేద?
నేటి సిలికానాంధ్ర సైనికులందరు
పంచె నడుముకి కట్టి ముందు దూకలేద?
అంతవరకెందుకు, నేటి మన పెళ్ళిలో
పంచెనే తెరగా వాడలేదా?
అట్టి పంచె విలువని మనకు గుర్తు చేసి
మనలోని పాత స్మృతుల నెన్నటినో రేపి,
ఓలలాడించినట్టి ఘనులు వీరు
సిలికానాంధ్ర సంఘపు జనులే సుమ్మీ!.
అట్టి పంచె కున్న ప్రశస్తినంత
గట్టిగా వివరింప భాగ్యమబ్బె
కట్టుడీ పంచె ఓ పురుషులార!
సన్యాసి మది ఎంతో పులకరించ. !!

## ఉగాది వచ్చేసిన వేళ

కిరణ్‌ప్రభ

చర్విత చరణం ఋతు గమనం.. ఇదే కాల చక్రం,
చూస్తూ చూస్తూనే ఉగాది వచ్చేసింది
ఇందులో పెద్ద విశేషమేముందీ...
అనుకుంటుండగానే అందింది
కవితా పఠనానికి రమ్మని ఒక ఆహ్వానం..!
క్రిందటేడాది చూసిన ఉగాదే కదా
నాడు విన్న ప్రకృతి గానమే కదా..
ఒక పాత కవితతో సరిపెడదామనుకున్నాను
బూజుదులిపి పుస్తకాలు వెదకడం మొదలెట్టాను..
"కొత్త సంవత్సరం రోజు పాత కవితా..!?" వంటింట్లోంచి శ్రీమతి అసంతృప్తి..
"పాత కవితకు కొత్త వాసన రాదు.." కుమార రత్నం ఉచిత సలహా..!
ఇంట్లోని ప్రేక్షకులనే ఒప్పించలేనప్పుడు
సభాసదుల్ని ఎలా మెప్పించగలను?
సందేహం మొలకెత్తింది సహజంగానే
కొత్త కవితకోసం మనసు తరిమింది వెను వెంటనే..!



Click here to watch Video

కవితరాసే స్ఫూర్తి కోసం..
వసంత వనంలోకి అడుగుపెట్టాను
ఉగాది సంకేతాలకోసం చుట్టూ పరికించాను..!
ఆశ్చర్యం..రంగుల సముద్రంలా ఉండాల్సిన పూలతోట నిరోమయంగా ఉంది,
కళాకాంతులు లేక వెలవెల బోతోంది..
కోయిల గానం కోసం ఎదురు చూస్తుంటే
ఓ మూలగా పడివున్న కోయిలలు కనిపించాయి,
ధవళకాంతులు చిందే వేపచెట్ల కోసం వెదుకుతుంటే
పూతలేక, ఆకురాలు కాలంనుంచీ
తేరుకోని చెట్లు నగ్నంగా దర్శనమిచ్చాయి,
విరగ్గాసి, పచ్చటి పిందెలతో నిండుగా ఉండల్సిన మామిడి చెట్లు,
విషాదభరిత యోగినుల్లా కనిపించాయి,
వసంత కాంతులతో కేరింతలు కొట్టాల్సిన పూలతోట

ఛిద్రమై, ఛిన్నాభిన్నమై, అతలాకుతలమై..!
నేనొచ్చింది సరైన సమయం కాదేమో..
పంచాగం తిరగేశాను..తిథి వారాలు మళ్ళీ చూశాను..
ఖచ్చితంగా ఇది ఉగాది సమయమే..
కొత్త సంవత్సరం రావల్సిన కాలమే..!
"కోయిలమ్మా..కోయిలమ్మా..
ఎందుకిలా ..రాగాలు లేని రాయిలా.. తెల్లారని రేయిలా..!?" ప్రశ్నించాను..
"ఏం చెప్పేది కవీ..-
సమకూర్చుకున్న రాగాల నిధులన్నింటినీ కృషి బాంక్‌లో దాచుకున్నాం.
పోగుచేసుకున్న స్వరాల ఆభరణాలనన్నింటినీ చార్మినార్ బాంక్‌లో
పొదుపుచేసుకున్నాం..
కృషి, వాసవి, కన్యక.. పేరేదైతేనేం..
కో ఆపరేటివ్ బాంకులన్నీ మా కలల్ని కూల్చేశాయి..
నమ్మిన మా అందర్నీ నట్టేట్లో ముంచేశాయి..
సర్వం కోల్పోయిన దీనచరితులం మేమిపుడు..
స్వరాలు మర్చిపోయిన రాగహీనులం మేమిపుడు..! " సమాధానం చెప్పలేక
ముందుకి కదిలాను..
"వేపచెట్టమ్మా..మామిడి కొమ్మా..మీకేమైందమ్మా..
పుల్లదనంలో కమ్మదనం చూపే మామిడి పిందెలెక్కడ?
ఆకులమధ్యన తెల్ల ముత్యాల్లా మెరిసే వేప పూతలెక్కడ? .." మరో సందేహాన్ని
ముందుంచాను..
"మమ్మల్నింకా గుర్తుంచుకున్న కవీ..
మా గురించి స్పందిస్తున్న మనిషీ..
దిన పత్రికలు చదవడం లేదా..
కల్లోలిత సమాజాన్ని గమనించడం లేదా..
పోలీసుల ఎన్‌కౌంటర్ లో పేలిన తూటాలూ..
మావోయిస్టుల ప్రతిచర్యలో ఎగిరిన బాంబులూ..
ఎవరికోసం ఎవరు త్యాగాలు చేస్తున్నారో..
ఎవరి రక్షణకోసం ఎవరు మరణిస్తున్నారో..
అర్థంకాని అయోమయంలో..రగిలిన రావణకాష్టంలో..


మేమూ మాడిపోయాం..
పూతని కోల్పోయాం..పిందెలు రాల్చేసుకున్నాం..
కొనవూపిరితో మిగిలున్నాం..."
'ఏం చెప్పాలో తెలీక పరిసరాలకేసి దృష్టి సారించాను..
"అమ్మా..వసంత వనబాలా..
నీకేమైంది తల్లీ..
మోసాలకూ, దారుణాలకూ సాక్ష్యంగా మిగిలావా..
నిన్నాశయించిన వాళ్ళని ఓదార్చలేకున్నావా..!
తరలివచ్చిన వసంత శోభతో వీళ్ళకి సాంత్వననివ్వలేవా..?"
"పిచ్చి కవీ.. నేను నాలా ఉన్నానా?
భూకబ్జాదారులు నన్ను సగం మింగేశారు..
మిగిలిన సగాన్ని, సునామీ తరంగాలు మట్టుబెట్టి వెళ్ళాయి..
ఇంకెక్కడిదీ వసంతం!? ఇంకెక్కడిదానాటి వైభవం..!?
ఇంకా నువ్విక్కడే వుంటే..
ఓ బందూకో..ఓ నాటుబాంబో.. ఈ దాదానో..ఓ రౌడీయో..
నీపై దాడి చేస్తారు..ఎంతకైనా బరితెగిస్తారు.. వెళ్ళిపో..వెళ్ళిపో.."
"బాబోయ్..ఎవరో తరుముకొస్తున్నారు..కాపాడండి..కాపాడండి.."
దుప్పటి ముసుగు తొలగించాను
ఇంతవరకూ ఆవరించిన కలల వలయంనుంచీ బయటికొచ్చాను..
ఎన్ని వాస్తవాలని చూపించిందీ స్వప్నం..!
ఐతే నిజంగానే ఉగాది ఆగి పోయిందా? వసంతం రానని భీష్మించిందా?
అనుమానంగా పెరట్లోకి వెళ్ళాను..
మామిడి పిందెలు చవులూరిస్తూ పిలిచాయి..
వేపపూత సౌరభాలు విరజిమ్ముతోంది..
కోకిలమ్మలు స్వర సాగర సంగమంలో మునిగి తేలుతున్నాయి..
వసంతం..వసంతంగానే నడిచొచ్చింది..
ఉగాదిని నిజంగానే వెంటబెట్టుకొచ్చింది..!
మరైతే కలలో కనిపించినవన్నీ!?
అవన్నీ ఎవరూ కాదనలేని నిజాలే..
అందర్నీ కలవర పరిచే ప్రశ్నల సందోహాలే..!

ఐనా..ప్రకృతి తన ధర్మం మరచిపోలేదు..
వసంతాన్ని తోడ్కొని రావడం మానలేదు..
సమస్యలు..సుడిగుండాలు.. ఎన్నున్నా..
చీకటి నిశిలో చుక్కలు చూడు
బాధల మధ్యన ఆశను చూడు,
తిమిరంతో సమరం సాగించు
వేకువ కోసం పురోగమించు..!
నిన్న పునాదులపై నేడు మొలుస్తుంది
నేటి ఆశలతో రేపు పుష్పిస్తుంది,
నిన్న ఎన్నడూ నేటికి సంకెల కారాదు
నేడు ఏనాడూ రేపటికి హద్దు కాబోదు..!
సంకల్పం, ఆశావాదం, పురోగమన సిద్ధాంతం..పాటించినంతకాలం..
ఎడారిలోనైనా ఉగాదిని కనుక్కోవచ్చు..
శిధిలాలోనైనా వసంతాన్ని సృష్టించవచ్చు..
గుండెనిండుగా ఆశలు నింపుకుందాం రండి..
కలల్నీ, కోరికల్నీ నిజం చేసుకునే మార్గం వైపు పయనిద్దాం..రండి..!



# మెరుపు కవితలు

గరిమెళ్ళ నాగేశ్వర రావు






గోడదాటిన గొర్రె
కుప్పకూలిన కుర్చీ
కొత్త జెండా లో పాత
ముఖం..!

✷ ✷ ✷



బస్సులో నవ్వుతూ
చిన్నప్పటి నేస్తం
ఇక ప్రయాణం
బాల్యంలోకి..!

✷ ✷ ✷



ఒకే టికెట్ కొన్నాను
కానీ
ప్రయాణిస్తున్నది మనిద్దరం !!

✷ ✷ ✷



రొయ్యలని వెదుకుతూ
సంద్రం ఓ రాత్రి ఊళ్ళోకి !!